క్లుప్తంగా

గిరిజన విద్యార్థుల మృతిపై చర్యలు చేపట్టాలి

● గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్

పార్వతీపురం రూరల్: ఇటీవల మామిడిపల్లి, ఎర్రసామంతవలస గిరిజన వసతి గృహాల్లో ఇద్దరు విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందడంపై గిరిజన విద్యార్థి సంఘం అధికారులు, ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారుల పర్యవేక్షణ లోపం, వసతి గృహాల్లో సరైన సదుపాయాలు, పౌష్టికాహారం లేకపోవడమే ఈ మరణాలకు కారణమని సంఘం అధ్యక్షుడు పల్లా సురేష్ ధ్వజమెత్తారు. గతంలో ఉన్న వైద్య సిబ్బందిని తొలగించడం వల్లే మరణాల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మరణాలకు బాధ్యులైన పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పార్వతీపురం: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం 10వ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగునాయుడు తదితరులు స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గడిచిన మూడేళ్లలో చేసిన కృషిని సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ, కార్యక్రమాలపై చర్చించుకునేందుకు ఈనెల 22న పార్వతీపురంలో మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, రైతులు, మేధావులు, అభ్యుదయవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాహనాలపై విధించిన అపరాధ రుసుము చెల్లించాలి



వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్సై ఎం. రాజేష్

సీతానగరం: మండలంలో పోలీస్ సిబ్బంది గతంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో విధించిన అపరాధ రుసుము బాకీలు చెల్లించి సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని హనుమాన్ జంక్షన్ ప్రధాన రహదారిపై బుధవారం సిబ్బందితో కలిసి వాహనాలకు సంబంధించిన రికార్డులు, ఆన్‌లైన్ ద్వారా పాతబాకీలు ఉన్న వివరాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలపై గతంలో విధించిన అపరాధ రుసుము చెల్లించకుండా వాహన చోదకులు తాత్సారం చేయడం వల్ల బాకీలు పేరుకుపోతున్నాయన్నారు. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయాల్లో పోలీసులు విధించిన అపరాధ రుసుం బాకీలు బయట పడుతున్నాయన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు నివారణకు వాహన చోదకులు సహకరించాలని కోరారు.

పచ్చిక బయళ్లలో బూర్జ వసతి గృహం



బూర్జ గ్రామ శివారులో పచ్చికతో ఉన్న వసతి గృహం


సీతానగరం: మండలంలోని బూర్జ వసతి గృహంలో విద్యార్థులు బిక్కుబిక్కుమని ఉంటున్నారని విద్యార్థుల పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. వసతి గృహంలో వివిధ గ్రామాలకు చెందిన పేద కుటుంబాల నుంచి వచ్చి ఇక్కడి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తూ స్థానిక వసతి గృహంలో 40 మంది ఉంటున్నారు. వారికి సరైన సౌకర్యాలు లేక పోగా వసతి గృహ ప్రాంగణంతా పచ్చిక గడ్డి మొలకెత్తడంతో నిరంతరం పాములకు నిలయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఓవర్‌హెడ్‌ట్యాంక్ మరమ్మతుల్లో ఉండడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో బోరు నీరే వాడుతున్నారు. ఇక్కడ ఆర్వో ప్లాంట్ లేకపోవడం విశేషం. వసతిగృహం ప్రాంగణమంతా శుద్ధి చేసి తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి

సీతానగరం: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ కొయ్యాన శ్రీరా ములు మాస్టారు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను అందజేయగా బుధవారం ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాబోధన చేయడమే కాకుండా శ్రీరాములు మాస్టారు వితరణ చేసిన మెటీరియల్‌ను వినియోగించు కోవాలని కోరారు.

పల్లె వైద్యంపై సమ్మెపోటు

● గ్రామాల్లో పడకేసిన సేవలు
● బోసిపోతున్న వైద్యశాలలు
● తీవ్ర ఇబ్బందుల్లో గ్రామీణులు



వెలవెలబోతున్న బలిజిపేట పీహెచ్‌సీ

బలిజిపేట:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండే వైద్యులు సమ్మెబాట పట్టడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు దూరమవుతున్నాయి. సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందంటూ వైద్యులు సమ్మెకు దిగడంతో గ్రామీణులకు వైద్యసేవలు అందడం లేదు. అత్యవసర సమయాలలో అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా కనిపిస్తోంది.



పీహెచ్‌సీలో బ్యాండేజీ వేస్తున్న కంటింజెంట్ వర్కర్



చిలకలపల్లిలో 104 వద్ద వైద్యులు లేకపోవడంతో మాత్రలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

వైద్యుల నిరసన బాట

డిమాండ్‌ల పరిష్కారమే లక్ష్యంగా సెప్టెంబర్ 28వ తేదీ నుంచి పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వైద్యులు నిరసన బాట పట్టారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి పీహెచ్‌సీ విధులకు దూరమై చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. పీహెచ్‌సీలలో వైద్యసేవలు దూరమయ్యాయని భావించిన రోగులు డబ్బులు ఖర్చుపెట్టి ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నామని తెలుపుతున్నారు.

నామమాత్రమైన 104వాహన సేవలు

షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు 104సిబ్బంది వెళ్లి రోగులకు బీపీ, సుగర్ చెక్‌చేసి తాత్కాలిక మందులు పంపిణీ చేయాలి. అవసరమైతే వైద్యులు ఇంటి వద్దకు వెళ్లి రోగులకు సేవలు అందించాల్సి ఉంది. 104 వైద్య పరీక్షలకు డాక్టర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 104వాహన సిబ్బంది గ్రామాల్లో ఉండే హెల్త్ క్లినిక్‌ల వద్దకు వెళ్లి ఉదయం 11గంటల వరకు ఉండి అక్కడికి వచ్చే వారికి మందులు ఇచ్చి పంపించేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేవి. నాడు–నేడు పేరుతో పీహెచ్‌సీలను అభివృద్ధి చేసి ఏరియా ఆస్పత్రి తరహాలో వైద్య సేవలు అందించేలా చేశారు. ప్రతి సచివాలయ పరిధిలో హెల్త్ సెంటర్ నిర్మించారు. ఇప్పుడు వారు సమ్మెబాట పట్టడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

వెలవెలబోతున్న పీహెచ్‌సీలు

వైద్యులు సమ్మెబాట పట్టకముందు పీహెచ్‌సీలలో ఓపీ 100కు పైగా ఉండేది. ఇప్పుడు పీహెచ్‌సీలలో ఓపీ ఏదో నామమాత్రంగా కనిపిస్తోంది. ఇద్దరు వైద్యులలో ఒకరు పీహెచ్‌సీలో ఉంటే మరొకరు 104 వాహనంతో వైద్యసేవలు అందించేందుకు వెళ్లేవారు. పీహెచ్‌సీలో వైద్యులను తాత్కాలికంగా ఏర్పాటు చేసినా అంతా నామమాత్రంగానే కనిపిస్తోంది.

ఆస్పత్రికి వెళ్లలేం...

పీహెచ్‌సీలలో సరైన వైద్యసదుపాయాలు కరువయ్యాయి. రెండు రోజులకు ఒక డాక్టరు మారుతున్నారు, ఎవరు ఎప్పుడు వస్తారో తెలియదు. సిబ్బంది ఏవో మందులు ఇచ్చేస్తున్నారు. వైద్యులు సక్రమంగా అందుబాటులో లేనప్పుడు పీహెచ్‌సీలకు వెళ్లలేకపోతున్నాం.

–శివుడు, పేషెంట్, బలిజిపేట

నాడు వైద్యం ఘనం.. నేడు దైన్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తదితరులు

● కోటి సంతకాల సేకరణ కరపత్రాల ఆవిష్కరణ

సాలూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్యం ఘనంగా ఉండేదని నేడు కూటమి పాలనలో వైద్యం దయనీయంగా మారిందని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర వాపోయారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న కోటి సంతకాల సేకరణ ప్రజాఉద్యమ కరపత్రాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రాజన్నదొర బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగాన్ని సువర్ణ అధ్యాయంగా మారిస్తే, ఈ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు వైద్యరంగాన్ని నీరుగార్చి ప్రజలకు ఆరోగ్య భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి పద్మావతి, వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు పరిమళ, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురం రూరల్: మండలంలోని, బాలగుడబ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మువ్వల నీలకంఠం నాయుడు మంగళవారం ఆరోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం బాలగుడబలోని నీలకంఠం నాయుడి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఒక సీనియర్ నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని, మృతుడి కుటుంబానికి పార్టీ, నాయకులు అండగా నిలుస్తారని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ పరామర్శలో ఆయనతో పాటు స్థానిక సర్పంచ్ ప్రతినిధి బూర సూర్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి మువ్వల సత్యం నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ సర్పంచ్ వర్రి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నీలకంఠం నాయుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, స్థానిక నాయకులు

మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

మక్కువ: మండలంలోని మూలవలస గ్రామానికి చెందిన తాడంగి చిన్నారి అనే విద్యార్థి బుధవారం అనారోగ్యంతో మృతి చెందడంతో, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్‌వై. నాయుడు తన సంతాపం తెలియజేశారు. చిన్నారి తల్లిదండ్రులు ముగిరి, శాంతమ్మలను కలిసి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల మరణాలతో, మన్యం జిల్లా వణికిపోతున్నా ప్రభుత్వం చలించడం లేదన్నారు. గిరిజన విద్యార్థుల మృతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు మృతుల కుటుంబసభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో గతంలో విధులు నిర్వహించిన, ఏఎన్ఎంలను కొనసాగించక, కొత్తగా ఏఎన్ఎంలను నియమించక విద్యార్థుల ఆరోగ్యంతో ప్రభుత్వం ఆడుకుంటోందని మండిపడ్డారు. ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థుల మరణాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆనంద్, గౌరమ్మ, భాస్కరరావు పాల్గొన్నారు.



మృతిచెందిన చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన సీఐటీయూ నాయకులు

అబ్దుల్ కలాం మహోన్నత వ్యక్తి

బలిజిపేట: అబ్దుల్ కలాం స్ఫూర్తిదాయకమైన, మహోన్నతమైన వ్యక్తి అని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు కొనియాడారు. ఈ మేరకు పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద బుధవారం అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా ప్రపంచంలోనే పేరు పొందారని, రాష్ట్రపతిగా తన సేవలు అందించి మహోన్నతమైన వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. భారతరత్న బిరుదును పొందారని తెలిపారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎ.గోపాలకృష్ణ, సాంబమూర్తి, వెంకటినాయుడు, వెంకటరమణ, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువకులు

ఉల్లాస్ అక్షర ఆంధ్ర లక్ష్యాలను అమలు చేయాలి

సీతానగరం: ఉల్లాస్ అక్షర ఆంధ్ర లక్ష్యాలను అమలుచేసి వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చి దిద్దడంలో విద్యా వలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ వహించా లని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ ఆఫీస్‌లో బుధవా రం ఆయన మాట్లాడుతూ 240 మంది వలంటీర్ల కు, పొదుపు సంఘాల సభ్యులకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామాల్లో గుర్తించిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చ ది ద్దడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర లక్ష్యాలను అమలు చేయడంలో వలంటీ ర్లు భాగస్వాములు కావాలని కోరారు. నిరక్షరాస్యులను 100 రోజుల్లో అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీ ఓ సహాయ ప్రోగ్రాం అధికారి బాలకృష్ణ, ఏపీఎం భారతి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు రూరల్: స్థానిక సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ కారణంగా సాలూరు, పాచిపెంట మండలాల పరి ధిలో గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కాగన గోపాలరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు మండలాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

104 వాహనం తనిఖీ

సీతానగరం: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఉన్న 104 సంచార వైద్యసేవా వాహనాన్ని బుధవారం సాయంత్రం 104 జిల్లా మేనేజరు ఎస్ కృష్ణ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, అందుబాటులో ఉన్న మందులున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంచార వైద్యసేవల వాహనం ద్వారా వైద్యసేవలు అందించాలని సూచించారు. మందుల కొరతలేకుండా ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వాహనంలో ఉన్న రికార్డులను, వాహనానికి సంబంధించిన కండిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది ఈశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన

కురుపాం: రేబిస్ వ్యాధిపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని మండల పశు వైద్యాధికారిణి శైలజ సూచించారు. మండలంలోని రజ్జిలి గ్రామంలో కుక్కలకు రేబిస్ టీకాలను బుధవారం వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ రేబిస్ వ్యాధి సంక్రమించే వ్యాధి అని ముందస్తుగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. గ్రామాల్లో వీధి కుక్కలకు కూడా వ్యాక్సినేషన్ చేస్తున్నామని అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూటక నీలవేణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

బలిజిపేట: 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు కె.శ్రీరామూర్తి జ్ఞాపకార్థం వారి కుమారులు నగదు బహుమతిని, మెరిట్ సర్టిఫికెట్‌లను అందించారు. గడిచిన విద్యాసంవత్సరంలో ప్రథమ స్థానం సాధించిన జి.గాయత్రి(575మార్కులు)కి రూ.5వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎ.పూజిత, ప్రియాంకల(565మార్కులు)కు రూ.3వేలు వంతున మొత్తం రూ.11వేలు నగదు బహుమతిని, మెరిట్ సర్టిఫికెట్లు కె.సూర్యం, శ్రీనివాసరావులు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకటినాయుడు మాట్లాడుతూ ఈ ప్రోత్సాహాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు మరింత ఉత్సాహంతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న దాతలు, ప్రధానోపాధ్యాయుడు వెంకటినాయుడు

గిరిజన విద్యార్థుల ప్రాణాలు చులకనా?



కలక్టరెట్ ఎదుట రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం, వివిధ సంఘాల నాయకులు

● ప్రభుత్వ నిర్లక్ష్యంపై గిరిజన సంఘాల మండిపాటు

పార్వతీపురం రూరల్: గిరిజన విద్యార్థుల ప్రాణాల పట్ల కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, వారి ప్రాణాలంటే అంత చులకనగా చూడడం తగదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ, వారంలోనే ఇద్దరు గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. సోమవారం సాలూరు మండలం మామిడిపల్లి, బుధవారం మక్కువ మండలం ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలల్లో ఈ మరణాలు సంభవించాయని, అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు.

తక్షణమే గతంలో పనిచేసిన ఏఎన్ఎంలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచి పౌష్టికాహారం, సురక్షితమైన తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని కోరారు. ఈ దీక్షకు కాంగ్రెస్ నాయకులు తీళ్ల గౌరీశంకర్ రావు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం, కోలక మల్లేష్, చందు తదితరులు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు.

సంతకాల ఉద్యమంతో సర్కారుపై సమరం



బాలగుడబలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: పేదలకు వైద్యవిద్య, నాణ్యమైన వైద్యాన్ని దూరం చేసేలా, వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు హెచ్చరించారు. ప్రభుత్వ వైద్యవిద్యను, సేవలను ధనవంతులకే పరిమితం చేసే దుర్మార్గపు ఆలోచనను ప్రజలు తిప్పికొడతారన్నారు. పార్వతీపురం మండలంలోని బాలగుడబ, వెంకట్రాయుడుపేట గ్రామాల్లో బుధవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు స్థానిక ప్రజామద్దతుతో దిగ్విజయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేసి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, అధికార ప్రతినిధి మువ్వల సత్యం నాయుడు, సర్పంచ్ ప్రతినిధి పండు బాబు, సీనియర్ నాయకులు వెంపలి గురురాజు, అనుబంధ విభాగాల నాయకులు చింతల ప్రసాద్, బూతల వెంకటరమణ, బలగ నాగేశ్వరరావు, తెర్లి రామస్వామి, సర్పంచ్ పెండ రమణ, పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.



స్వచ్ఛందంగా సంతకాలు చేస్తున్న మహిళలు

12రకాల ద్రావణాలపై శిక్షణ

బలిజిపేట: మండలంలోని మిర్తివలసలో గల శ్రీ శ్రీనివాసరావు బయో రిసోర్స్ ఇన్‌పుట్ సెంటర్ వద్ద ఆర్‌వైఎస్ఎస్ కన్సల్టెంట్ కె.రమాప్రభ ఆధ్వర్యంలో కషాయాల తయారీపై 4రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన బయో రిసోర్స్ సెంటర్స్ ఓనర్స్‌కు 4 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి 12 రకాల కషాయాల తయారీపై అవగాహన కల్పించి చేసి చూపించారు. పంచగవ్య ద్రవ్య జీవామృతం, ఘన జీవామృతం, కోడిగుడ్డు నిమ్మరసం మీనామృతం, నేచర్ పొటాష్ పలు పత్ర అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం నీమాస్త్రం, మట్టి ద్రావణం తదితర కషాయాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ ఇచ్చే ట్రైనీలు ఎస్.శ్రీనివాస్, జి.అన్నపూర్ణ, శివ, గోవిందరాజు, హరికృష్ణ, లక్ష్మి, తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.



మిర్తివలసలో బయోఇన్‌పుట్ సెంటర్ వద్ద జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

ప్రమాదాలకు నిలయంగా మామిడిపల్లి రహదారి

సాలూరు రూరల్: సాలూరు పట్టణం నుంచి మామిడిపల్లి మీదుగా పలు గిరిజన గ్రామాకు నిత్యం రద్దీగా ఉండే రహదారి గోతుల మయమై ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం ద్విచక్రవాహనాలు వందల సంఖ్యలో ఈ రహదారిలో ప్రయాణిస్తుంటాయి. గత ప్రభుత్వంలో మామిడిపల్లి నుంచి శంబర, తోణాం, కురుకుట్టి రహదారుల నిర్మాణం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు సాలూరు నుంచి మామిడిపల్లి వరకు గల రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు గోతుల్లో ప్రయాణం చేయాలంటే భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. గతంలో ఈ రోడ్డుపై గుంతలు అంతంతమాత్రంగా ఉండడంతో మరమ్మతులు చేయగా నాణ్యతా లోపంతో నెలలు తిరక్కముందే మళ్లీ గోతులు యథావిధిగా ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



అడుగుకో గొయ్యితో మామిడిపల్లి రోడ్డు